## క్లుప్తంగా

### సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**చీపురుపల్లి రూరల్(గరివిడి):** గరివిడి మండలంలోని వెదుల్లవలస గ్రామానికి చెందిన ఎర్ర అప్పయ్యమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.40వేలు మంజూరైంది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్‌ను గరివిడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములునాయుడు శుక్రవారం లబ్ధిదారుకు అందజేశారు. కొన్ని నెలల కిందట అనారోగ్యంతో విశాఖపట్నం ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న ఎర్ర అప్పన్నకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వర్తించనందున ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందించింది. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గుడివాడ తమ్మినాయుడు, మన్నెపూరి శ్రావణ్, అర్తమూరు సర్పంచు పొన్నాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సామాజిక తనిఖీలపై గ్రామసభ

**మెరకముడిదాం:** మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి నిధులతో చేపట్టిన పనులపై చేపట్టిన సామాజిక తనిఖీలపై ఆడిట్ బృందాలు గ్రామసభలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగానే మండలంలోని రామయవలస, చెల్లాపురం తదితర గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు జరిగాయి. గ్రామంలో చేపట్టిన పనులు, వేతనాల చెల్లింపు తదితర వివరాలను వేతనదారుల వద్ద ఆరాతీశారు. సామాజిక తనిఖీల్లో గుర్తించిన అంశాలను గ్రామస్తులకు వివరించారు.

### హోమగాయత్రి విగ్రహాల వితరణ

**శృంగవరపుకోట:** హైందవ ధర్మం పరిరక్షణే ధ్యేయంగా శంబలనగరిలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆశ్రమ నిర్వాహకులు చెప్పారు. కిల్తంపాలెం పంచాయతీ పరిధి రాజీపేట గ్రామంలో ఉన్న శంబలనగరి ఆధ్యాత్మిక నిలయంలో శుక్రవారం హోమగాయత్రి విగ్రహాల వితరణ కార్యక్రమం నిర్వహించారు. సంతానం లేని దంపతులకు ప్రత్యేకంగా ఋషి చైతన్యం వితరణ, మూడేళ్ల లోపు బిడ్డలకు నామకరణ, చంటిబిడ్డలకు వ్యాధి నిరోధక తీర్థం వితరణ చేశారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన పలువురు దంపతులు ఈ హోమంలో పాలు పంచుకున్నారు. ఫిబ్రవరి ఆరో తేదీన మరోసారి ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

### గ్రామసభల్లో అభివృద్ధి పనుల గుర్తింపు

**వేపాడ:** మండలంలోని రామస్వామిపేట, గుడివాడ, కరకవలస, దబ్బిరాజుపేట, ఆతవ, శింగరాయి, కొండగంగుబూడి పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలను అధికారులు సేకరించి ప్రణాళికలు తయారు చేశారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిలైట్లు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై చర్చించారు. పాటూరు గ్రామంలో కార్యదర్శి బి.సంధ్యశ్రీ గ్రామసభ ఏర్పాటు చేయగా.. సర్పంచ్ కొట్యాక వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ కె.రమణమూర్తి, ఎంపీటీసీ ద్వారపూడి మంగమ్మ తదితరులు నిరసన తెలపడంతో గ్రామసభ నిలిచిపోయింది. హాజరు కాకపోవటంతో పాటూరు గ్రామసభ జరగలేదు.

### అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న శ్రీనివాసనాయుడు

**చీపురుపల్లి:** పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ సతీష్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ చొరవతో కళాశాల అభివృద్ధికి నాడు-నేడు కింద ప్రభుత్వం రూ.85 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఆ నిధులతో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, విద్యుద్దీకరణ, బెంచీలు, తాగునీటి సదుపాయం వంటి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వారితో పాటు ఎంపీటీసీ గిరడ రాందాసు, మీసాల సీతారాం, కిషోర్, రామారావు తదితరులు ఉన్నారు.

### నేడు దేవానందుల స్వామి ఆరాధనోత్సవం

**బొండపల్లి:** మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో దేవానందుల స్వామి 23వ ఆరాధనోత్సవాలను శనివారం నిర్వహించనున్నట్లు నిర్వాకులు, గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అహోబిల రామానుజ జీయర్ స్వామి పాల్గొననున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటలకు ఆశ్రమం ఆవరణంలో ధ్వజారోహణం, నగర సంకీర్తనతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆశ్రమం ఆవరణంలో మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

# మాట తప్పని ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేశారు
- పింఛన్ కానుక వారోత్సవంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య



పెరిగిన పింఛన్ మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

**గజపతినగరం:** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాల్లో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజపతినగరం నియోజకవర్గంలో వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి రూ.987 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. గజపతినగరం మండలంలో 318 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి ఈ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

**హామీలను అమలు చేశాం..**

విజయనగరం గాజులరేగ వద్ద రూ.500 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, రూ.150 కోట్లతో జాతీయ రహదారి అభివృద్ధి, గజపతినగరంలో రూ.17 కోట్లతో 100 పడకల ఆస్పత్రి భవనం, రూ.40 కోట్లతో బైపాస్ రోడ్డు, దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో విజయనగరంలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల, రూ.90 కోట్లతో నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ పథకం కింద పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాం కాబట్టే ఈ రోజు ప్రజల మధ్య ధైర్యంగా తిరుగుతున్నామన్నారు. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లాకు వచ్చినప్పుడు టీడీపీ హయాంలో విజనగరం జిల్లాలో, గజపతినగరం నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని కోరగా.. ఒక్కటి కూడా చెప్పలేక పోయారని ఎద్దేవాచేశారు. అటువంటి వారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.



సమావేశానికి హాజరైన పింఛన్‌దారులు

**భూహక్కు పత్రాల పంపిణీ..**

గజపతినగరం మండలంలో భూముల రీసర్వే పూర్తయిన రామన్నపేట, ఎన్‌జీఆర్‌పురం, డోలపాలెం, టి.కె.సీతారామపురం, భగీరథపురం గ్రామాల్లో రైతులకు భూహక్కు పత్రాలను ఎమ్మెల్యే అప్పలనరసయ్య పంపిణీ చేశారు. ఈ ఐదు గ్రామాల్లో 222 మంది రైతులకు భూహక్కు పత్రాలు అందజేశారు.

**మునగ మొక్కల పంపిణీ..**

గజపతినగరం మండలం కొత్తబగ్గాం, ముచ్చర్ల, తుమికాపల్లి గ్రామాల్లోని నర్సరీల్లో మునగ మొక్కలతో పాటు పలురకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. మహిళలు, కిశోర బాలికలు రక్తహీనత బారిన పడకుండా మునగ ఆకులను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పలువురు మహిళలకు మునగ మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, సీనియర్ నేతలు మండల సురేష్, బెల్లాన త్రినాథరావు, పల్లి సంజీవరావు, వైస్ ఎంపీపీ కర్రి శ్రీదేవి, ఎంపీటీసీలు మండల సూర్యకళ, కర్రి కళావతి, రేగ లత, ఇన్‌చార్జి ఎంపీడీఓ పప్పు సుదర్శనం, ఏపీఎం యు.జగదీష్ కుమార్, ఏపీఓ రామారావు, యువజన నాయకుడు లెంక గణేష్, మంత్రి నర్సింగరావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిజ్ఞ

**గంట్యాడ:** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ అన్నారు. స్థానిక కొఠారుబిల్లి జంక్షన్‌లో శుక్రవారం వృద్ధి కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. అతి వేగంతో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాన్ని నడపకూడదని, వాహనాన్ని తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాలను చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐ తిరుపతిరావు, ఎస్సై కిరణ్‌కుమార్‌నాయుడు, రంభసత్యారావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న నరసింహమూర్తి, జైహింద్‌కుమార్

# వ్యాసరచన పోటీలకు చక్కని స్పందన



ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**చీపురుపల్లి:** రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ కుమారుడు డాక్టర్ బొత్స సందీప్ వ్యవస్థాపించిన ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలకు చక్కని స్పందన లభించింది. జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలతో పాటు అన్ని ప్రైవేటు కళాశాలల్లో శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. యువతలో ఉన్న సామాజిక, వైజ్ఞానిక విలువలు పెంపొందించేందుకు 'దేశ నిర్మాణంలో యువత పాత్ర' అనే అంశంపై జరిగిన ఈ పోటీలో చీపురుపల్లి, గరివిడి పట్టణాల్లో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల నుంచి దాదాపు 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.15వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.5వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



గంట్యాడ: మాట్లాడుతున్న ఏపీఎం శ్రీనివాస్



కొత్తవలస రూరల్: దేవాడ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



మెరకముడిదాం: రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి



వేపాడ: రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

**గంట్యాడ:** గర్భిణులు, కిశోర బాలికలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని వెలుగు ఏపీఎం శ్రీనివాస్ సూచించారు. మండలంలోని బుడతానపల్లి హైస్కూల్లో గర్భిణులకు, కిశోర బాలికలకు రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత వల్ల గర్భిణులు ప్రసవ సమయంలో ఇబ్బందిపడే అవకాశం ఉందన్నారు. రక్తహీనత నివారణకు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్డు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీలు చిన్నంనాయుడు, గౌరీశ్వరి, అచ్చింనాయుడు తదితరులు పాల్గొన్నారు.

**ఏపీ మోడల్ స్కూల్‌లో..**

**మెరకముడిదాం:** రక్తహీనతపై కిశోర బాలికలు తప్పనిసరిగా అవగాహన కలిగివుండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.శ్రీదేవి అన్నారు. గర్భాం ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థినిలకు స్త్రీశిశు సంక్షేమ శాఖ, ఆరోగ్యశాఖ, వెలుగు ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలకు కనీసం 11 గ్రాములకు తక్కువ కాకుండా హిమోగ్లోబిన్(హెచ్‌బీ) ఉండాలని సూచించారు. బాలికలు రక్తహీనతకు గురికాకుండా సమతుల్య పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఉమామహేశ్వరరావు పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భాం పీహెచ్‌సీ సిబ్బంది, మోడల్ స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**వేపాడలో..**

**వేపాడ:** మండల కేంద్రం వేపాడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక రామాలయం వద్ద శుక్రవారం రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రక్తహీనత వల్ల కలిగే అనారోగ్య లక్షణాలు, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన ఆహారం పదార్థాలను సీహెచ్ఓ ఆంజనేయులు స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసరావు, హెచ్ఎస్ సత్యనారాయణ, ఐసీడీఎస్ సిబ్బంది, వీఓఏలు పాల్గొన్నారు.

**వియ్యంపేట ఐసీడీఎస్ పరిధిలో..**

**కొత్తవలస రూరల్:** వియ్యంపేట ఐసీడీఎస్ పరిధిలో దేవాడ, రామలింగపురం, తుమ్మికాపల్లి గ్రామాల్లో అనీమియా ముక్త భారత్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రక్తహీనతకు దారితీసే కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.వరలమ్మ గర్భిణులు, కిశోర బాలికలకు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎంఎల్‌హెచ్‌పీలు కామేశ్వరి, గీతిక, నాగజ్యోతి, ఏఎన్ఎంలు వరలక్ష్మి పాల్గొన్నారు.

### జూదరుల అరెస్టు

**గుర్ల:** మండలంలోని కోటగండ్రేడు శివారు ప్రాంతంలో పేకాట స్థావరంపై ఎస్ఐ శిరీష శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.15,470 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు. జూదం ఆడుతున్న స్థావరాలపై సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.


### రక్షణగోడ నిర్మాణం



రక్షణగోడ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న ఎస్సై ముకుందరావు

**లక్కవరపుకోట:** అరకు-విశాఖపట్నం జాతీయ రహదారిలో సోంపురం బ్రిడ్జి వద్ద ధ్వంసమైన రక్షణగోడను ఎస్ఐ ఎస్.ముకుందరావు ఆధ్వర్యంలో శుక్రవారం పునర్నిర్మించారు. మూడు రోజుల కిందట లారీ అదుపు తప్పి దూసుకుపోవడంతో రక్షణగోడ పూర్తిగా ధ్వంసమైంది. కాగా ఈ ప్రదేశంలో రక్షణగోడ లేకపోతే ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని భావించిన పోలీసులు వెంటనే గోడ నిర్మాణ పనులు చేపట్టారు.


### ఎంపీడీఓకు సత్కారం



ఎంపీడీఓను సత్కరిస్తున్న ఎంపీపీ చలం నాయుడు, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు

**బొండపల్లి:** వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో బొండపల్లి మండలం జిల్లాలో మూడో స్థానంలో నిలిచింది. చిట్టిగురువులు కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసినందుకు ఎంపీడీఓ ఎ.వేదవతి జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్ల చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, మండల పరిషత్ సిబ్బంది శుక్రవారం ఎంపీడీఓను ఘనంగా సత్కరించారు. మండల వ్యాప్తంగా 3200 మంది వయోజనులు పరీక్షలు రాయగా అందులో 3106 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాచకిండాం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ గొల్లు సతీష్, సీనియర్ సహాయకులు డి.సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### జోరుగా పారిశుద్ధ్య పనులు



గుర్లలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ కల్యాణి

**గుర్ల:** మండలంలోని గుర్ల, జమ్ముపేటలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మండల కేంద్రంలో చేపట్టిన పనులను ఎంపీడీఓ బి.కల్యాణి శుక్రవారం పరిశీలించారు. డ్రైనేజీలో పూడికలు తొలగించి దోమల నివారణ మందును పిచికారీ చేయాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రసాద్ ఉన్నారు.

# ప్రధాన రహదారిలో ఫ్లెక్సీల తొలగింపు

**చీపురుపల్లి:** పట్టణంలోని ప్రధాన రహదారిలో విద్యుత్ స్తంభాలకు ఉన్న ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది శుక్రవారం తొలగించారు. పలువురు ప్రయాణికుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు ఫ్లెక్సీలను తొలగిస్తున్నట్లు వారు తెలిపారు. విజయనగరం-పాలకొండ, చీపురుపల్లి-శ్రీకాకుళం ప్రధాన రహదారిలో ఉన్న విద్యుత్ స్తంభాలకు పలు రాజకీయ పార్టీలు, వాణిజ్య, వ్యాపార ప్రకటనలకు సంబంధించిన ఫ్లెక్సీలను కట్టడంతో రోడ్డు మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడక వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పలువురు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు వెంటనే స్పందించి ఫ్లెక్సీలను తొలగించారు. ఇక మీదట పట్టణంలోని విద్యుత్ స్తంభాలకు ఎలాంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయొద్దని మేజర్ పంచాయతీ అధికారి ఝాన్సీ కోరారు.



విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

# చురుగ్గా తారురోడ్డు నిర్మాణ పనులు



జాతీయ రహదారి నుంచి మర్రివలసకు నిర్మిస్తున్న రోడ్డు

**దత్తిరాజేరు:** మరడాం, మర్రివలస గ్రామాలకు తారురోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నాబార్డ్ నిధులు రూ.1.60 కోట్లతో జాతీయ రహదారి నుంచి మరడాం రైల్వే ట్రాక్ వరకు, జాతీయ రహదారి నుంచి మర్రివలస శ్మశానవాటిక వరకు సుమారు కిలో మీటర్ మేర పనులు చేపడుతున్నారు. పీఆర్ జేఈ అప్పలనాయుడు శుక్రవారం పనులను పర్యవేక్షించారు. గతంలో పాలకులు తారు రోడ్డు వేయకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడేవాళ్లమని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మారుమూల గ్రామాల్లో రోడ్డు వేస్తుండడంతో ప్రయాణ కష్టాలు తీరనున్నాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

**గుర్ల:** మండలంలోని కొండగండ్రేడు గ్రామ సచివాలయం వద్ద ఆధార్ సేవా కేంద్రాన్ని సర్పంచ్ సారిక గోవింద్ శుక్రవారం ప్రారంభించారు. ఆధార్ అప్‌డేట్, బయోమెట్రిక్ సేవలు పొందాలనుకునేవారు ఈ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముద్దాడపేట సర్పంచ్ పల్ల సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆధార్ కేంద్రాన్ని ప్రాంభిస్తున్న సర్పంచ్ గోవింద్, తదితరులు

# ఎమ్మెల్యేకు విద్యార్థుల వినతి

**గజపతినగరం:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని, అదనపు మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. మెస్‌చార్జీల పెంపు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి డి.రాము తదితరులు ఉన్నారు.

# పీహెచ్‌సీలో విజిలెన్స్ తనిఖీలు

**బొండపల్లి:** మండలంలోని బొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎస్సై బి.సింహాచలంతో పాటు జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ భారతి ఆస్పత్రిలోని వివిధ విభాగాల రికార్డులు, మందులు నిల్వలను పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎల్.సత్యనారాయణ, ఆర్.అమృతవల్లి తదితరులు పాల్గొన్నారు.



బొండపల్లి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

# బొద్దాంలో కంటి వైద్యశిబిరం



అవ్వాతాలకు కంటిపరీక్షలు చేస్తున్న డాక్టర్ ఈశ్వరరావు

**వేపాడ:** మండలంలోని బొద్దాం గ్రామంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద అవ్వాతాతలకు శుక్రవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్యుడు సీహెచ్ ఈశ్వరరావు 36 మందికి పరీక్షలు చేశారు. వారిలో 12 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయడంతో పాటు కళ్లద్దాలు అందజేయనున్నట్లు చెప్పారు. కంటి వెలుగు వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం గౌరీ, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# రెవెన్యూ రికార్డుల పరిశీలన

**వేపాడ:** స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ అకౌంట్ సెక్షన్ ప్లానింగ్ సూపరింటెండెంట్ కె.తులసీదాస్, సీనియర్ అసిస్టెంట్లు ఎం.రవికుమార్, బి.వి.రమణమూర్తి శుక్రవారం సందర్శించారు. కార్యాలయ రికార్డులు, 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరంలో మండల పరిషత్ నిర్వహించిన లావాదేవీలు, జీతభత్యాలు, జనరల్ ఫండ్ నిధుల కేటాయింపు తదితర రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పట్నాయక్, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

# డ్రగ్స్‌తో జీవితాలు నాశనం




ర్యాలీలో పాల్గొన్న ఎస్ఈబీ సిబ్బంది, విద్యార్థులు

- ఎస్ఈబీ సహాయ సూపరింటెండెంట్ డి.శైలజారాణి

**కొత్తవలస:** రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సహాయ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ డి.శైలజారాణి అన్నారు. ఎస్ఈబీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యువతా మేలుకో, భవితను మలుచుకో.. డ్రగ్స్ వదులుకో.. డ్రగ్స్ రహిత సమాజం- సంక్షేమానికి సంకేతం అంటూ ప్లేకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. అనంతరం శైలజారాణి మాట్లాడుతూ.. యువత డ్రగ్స్‌కు బానిసై నిండుజీవితాన్ని నాశనం చేసుకోవద్దని కోరారు. గంజాయి, హాషిష్, కొకైన్, హెరాయిన్ వంటి డ్రగ్స్‌ను మీ పరిసర ప్రాంతాల్లోను, విద్యా సంస్థలల్లో వినియోగిస్తున్నట్లు సమాచారం తెలిస్తే 14500 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ సీహెచ్.రాజేశ్వరి, ఎస్ఐ పి.నరేంద్రకుమార్, స్థానిక ఎస్ఐ బి.దేవి, ఎస్ఈబీ సిబ్బంది, భారత్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.